"ఇవాళ మధ్యాహ్నం మన ప్రబుద్ధుడు డబ్బుతో సహా పర్స్ కొమరయ్యకి తిరిగి ఇచ్చాడట. ఓ మినీ కథతో "ఆనెస్టీ ఈజ్ ది బెస్టు పాలసీ" అన్న సంగతి బాగా బోధించావు మన కుమారరత్నానికి. ఎలా గయినా రచయిత్రివి కదా"

# బిగ్ ఇడియట్

సాయంత్రము దగ్గరపడే కొద్దీ త్రిభువన్‌కి ఎంతో ఆనందంగా వుంది. ఆ సాయంత్రము ఆరున్నరకు అతని జీవితంలో మరపురాని రోజుగా మారే సంఘటన జరుగుతోంది.

తొలిసారిగా త్రిభువన్ స్టేజ్ ఎక్కుతున్నాడు

సన్మానింపబడుడున్నాడు రచయితలని, రచయిత్రులని, ముఖ్య మంత్రులని, సినిమా పరిశ్రమకి సంబంధించిన వాళ్ళని సన్మానించటం రివాజే

కార్టూనిస్టులకి ఎందుకో ఆ గౌరవం లభించటంలేదు. తొలిసారిగా త్రిభువన్‌ని హైద్రాబాద్‌లోని ఓ సాంస్కృతిక సన్మానిస్తోంది, ఆయన వేసిన కార్టూన్స్‌లో వెయ్యి ప్రచురింపబడిన సందర్భంగా.

చాలాకాలంనుంచి తనకి సన్మానం జరగాలనే కోరిక త్రిభువన్‌లో వుంది. ప్రయత్నం లేకుండా, మెరిట్‌మీద సన్మానం జరగడం ఈ రోజులలో అరుదు కాబట్టి త్రిభువన్ తన ప్రయత్నాలు ప్రారంభించాడు.

నెలరోజులలో ఓ సాంస్కృతిక సంస్థ సెక్రటరీకి, త్రిభువన్‌కి ఓ అంగీకారం కుదిరింది. ఆగస్టు రెండోఆదివారం సాయంత్రం ఆరున్నరకి

త్రిభువన్ని రవీంద్రభారతిలో సన్మానిస్తున్నారనే పాంప్లెట్స్ పదిహేను వందలు ముద్రించి అనేకమందికి పంపారు. కవర్లలో ముఖ్యులకి ఆహ్వాన పత్రాలు పంపారు. పక్కనే వున్న కళాభవన్లో ఆయన కార్టూన్స్ ఎగ్జిబిషన్ని కూడా ఆరోజు ఏర్పాటుచేశారు. ఎగ్జిబిషన్కి హైద్రాబాదులో షూటింగులోవున్న ఓ హాస్యనటుడు ప్రారంభోత్సవం చేస్తాడు. త్రిభువన్ని ఆయనే ఆ సాయంత్రం దుశ్శాలువతో సన్మానిస్తాడు బి.హెచ్.ఇ.ఎల్‌లో పనిచేస్తున్న త్రిభువన్కి ఆ సంస్థ జనరల్ మేనేజర్ సాంస్కృతిక సంస్థ తరపున మెమొంటోని బహూకరిస్తాడు. గంటన్నర స్పీచెస్ అయ్యాక త్రిభువన్ వారంవారం వో వారపత్రికకోసం గీసే కార్టూన్ స్క్రిప్‌లోని నాలుగు పాత్రలతో రాసిన వో హాస్య నాటకాన్ని ప్రదర్శిస్తారు.

త్రిభువన్ అన్ని విషయాలు స్వయంగా చూసుకున్నాడు. ఎక్కడా ఎలాంటిలోపం జరగకూడదని, ముఖ్యంగా తనని అభినందిస్తూ దండలు వేసే వో యాభై మందిని పోగుచేసి యాభై దండలని టోకున బేరం చేసి ఆర్డర్ చేశాడు.

ఆరోజు శెలవుపెట్టి వుదయమే తన మోటార్ సైకిల్‌మీద సిటీకి వచ్చేశాడు త్రిభువన్. రాత్రి కార్యక్రమం అయాక ఇంటికి వెళ్ళడానికి వీలుగా తన మిత్రుడి దగ్గర మోటార్ సైకిల్ని అరువు తీసుకున్నాడు.

క్రమంగా సాయం సమయం ఆసన్నమయింది. త్రిభువన్ తను రాసుకున్న స్పీచ్ని మరోసారి మననం చేసుకున్నాడు. కాగితంలో రాసి చదవటం కంటె, అప్పటికప్పుడు చెప్పినట్లుగా చెప్పటం మంచిదనే అభిప్రాయంతో.

సాయంత్రం ఆరుపదికి ఫ్లవర్ మార్కెట్ దగ్గర మోటార్ సైకిల్ ఎక్కి_ రవీంద్రభారతి వైపు బయలుదేరాడు జరగబోయేది తలుచుకుంటే అతనికి ఎంతో వుత్సాహంగా, సంతోషంగా వుంది.

మోటార్‌సైకిల్‌ని రవీంద్రభారతిలోని మోటార్ సైకిల్‌స్టాండ్‌లో ఆపాడు, కిందకి దిగి స్టాండ్ వేయబోయాడు, సాంస్కృతిక సంస్థసెక్రటరీ త్రిభువన్‌ని రిసీవ్ చేసుకోడానికి అటువైపు వెళ్ళబోతూ తక్కున ఆగిపోయాడు ఆశ్చర్యంగా.

త్రిభువన్ మళ్ళీ మోటార్‌సైకిల్ ఎక్కాడు క్షణాలలో అది వేగంగా బయటికి వెళ్ళిపోయింది. అతను మళ్ళీవస్తాడని ఎదురుచూశాడు. కాని ఆరున్నరయినా రాలేదు.

ఆరుముప్పావయినా రాలేదు.

ఏడయినా రాలేదు.

ఏడున్నరదాకా చూశాక ఏం చెయ్యాలో తోచలేదు సెక్రటరీకి. త్రిభువన్ లేకుండా ఎలా ఆ కార్యక్రమం నిర్వహించటం? విసుగుపుట్టి హాస్యనటుడు వెళ్ళిపోయాడు, కోపంవచ్చి జనరల్ మేనేజర్ వెళ్ళిపోయాడు. హాస్యనాటికని మాత్రం ప్రదర్శించారు. సెక్రటరీకి త్రిభువన్ మీద చెప్పలేనంతకోపం వచ్చింది

ఎనిమిదిన్నరకి ప్రేక్షకులు బయటికి వెళుతుండగా పిల్లిలావచ్చాడు త్రిభువన్

"ఎంత పనిచేశావ్ బాస్? మా సంస్థ కార్యక్రమాలలో ఎప్పుడూ ఇలా జరగలేదు" చెప్పాడు సెక్రటరీ అతన్ని చూసి ఉక్రోషంగా.

"ఏం చెయ్యను అలవాటు లేదేమో మోటార్‌సైకిల్ దిగుతుంటే వెనకాల పేంట్ సర్రుమని చిరిగింది. ఎలా రాను అలా? ఇంటికెళ్ళి పేంట్ మార్చుకుని వస్తున్నాను" ఏడుపు మొహంతో చెప్పాడు త్రిభువన్.